# విన వేడుక....

కన్నయ్యా ఎక్కడ?

గోపిక లెక్కడ ఉంటే అక్కడ!

గోపిక లెక్కడ?

మన గుండెలే గోపికలు కదా! ఆ గుండె లాడిన మాట పాటయి, పాట ఆటయి, ఆట ఆనంద మయి, ఆనంద మంతా వేణుగానమై, ఆ గాన మంతా ఆకాశమైతే ఆ నీలమే కన్నయ్యా కాదూ?

కన్నయ్యా మరి ఉన్నట్టా, లేనట్టా!

అడిగిన వారికి వలికే, పాడే గుండె ఉంటే ఉన్నట్టే; అలాటిది ఆ గుండె కాస్తా 'లబ్'లు, 'డబ్'లు మాత్రమే తెలిసిన దయితే కన్నయ్యా లేనట్టే.

-ఆ నవనీత చోరుడిని, నవమోహనాకారుడిని తమ మధ్య నిలబెట్టుకోగలిగిన వాళ్ళకు జీవిత మంతా పండగే - అందులో ఒక పండగ ఉట్టి కొట్టడం.

-మనుషులు దేవు ళ్ళవడానికి రంగం సిద్ధమైన చోట దేవుడే మని షవుతా డనే సత్యానికి మరో రూపమైన ఈ నదసత్ సంజ కెంజాయల వర్ణ చిత్రాన్ని-

రచించగల కుంచెలు, రంగులు ఒక్కరి దగ్గరే ఉండేవి...

ఆయన గీచిన మాటల బొమ్మే ఇది... తెలుగు కథల బంగారు పుటల నుండి దొంగలించుకు వచ్చిన - ఈ వైనం 'విన వేడుక' గాదే!

శ్రీకృష్ణుడు జన్మించిన దెక్కడ?

అలనాడు మధురలో.

మానాడు, మా కనులముందు, మా బందరులో-

అలనాడు - బందరులో, గొడుగుపేటలో, గొల్లగూడెంలో.


అప్పటి సర్కారు వారికి ఇప్పటి ప్రభుత్వ ఆసాముల కున్నటువంటి చారిత్రాత్మక పరిజ్ఞానం, ప్రగతిశీలం మస్తుగా లేని కారణాన్నో, ఏమో గొల్లవారిని యాదవులను చేయకుండా, వా రంతకు ముందు తరతరాలుగా బ్రతుకుతూన్న తీరునే బ్రతుక నిచ్చారు.

ఆ గొల్లగూడెంలో, ఓ తగుపాటి గుడిసెలో, ఓ వెర్రిగొల్లాడి కడుపున, అప్పటికి పద్దెనిమి దేళ్లనాడు ఓ ఆడపిల్ల పుట్టింది. తెలివితేటల్లో వాళ్ళ అయ్యే మెరు గనిపించింది. పిల్ల చిలకలా గుండేది. పొద్దస్తమానం నవ్వుతూ ఉండేది. క్షణాని కో నవ్వు నవ్వేది. దీన్ని చూసి తీరుబడి ఉన్నప్పుడల్లా వీళ్ల అయ్య నవ్వేవాడు. ఆ నవ్వు ఆ నోటా ఆ నోటా కమ్ముకుపోయేది - ముప్పొద్దులా, గూడెం అంతా! ఆ నవ్వులు మా పేటలో వాళ్లకి గుమ్మపాలు!

వాళ్ళ అయ్య పేరు చెన్నయ్య. చెన్నుగా డంటే కాని తెలియదు. మనిషి మాంచి ఉదారుగా ఉండేవాడు. చేతి కందినంత మేరా నామాలు పెట్టుకునేవాడు. పచ్చగా కందిపోయి ఉండేవాడు. మెత్తగా మాట్లాడేవాడు.

అప్పటికే దేశవ్యాప్తమై ఉంటూన్నా పాలల్లో నీళ్లు కలిపే ప్రక్రియ వీళ్లు అజ్ఞానులు కావడంతో తెలిసి రాలేదు. వాళ్ళు పిండినా, మేం పుచ్చుకున్నా అవి సినలుగా పాలే. అలాటి పాలు పుచ్చుకున్న వాళ్లపాలిట దైవం ఎందు కుండదట?

ఈ చెన్నుగాడు సుద్దులు చెప్పడంలో మొనగాడు. వాడి నోరు క్షణం ఊరుకుండేది కాదు.



ఎప్పుడూ కృష్ణుడి పేరు రాపాడుతూనే ఉండేవాడు. అడగని వారిది పాపం. కృష్ణలీలలు త్రవ్వి తల కెత్తేవాడు. ఎదుట వినేందుకు మనిషి లేడో - ఏదుంటే దానికి చెట్టయినా, పుట్టయినా సరే కృష్ణ కథామృతం ఉగ్గువట్టేవాడు - పిచ్చి సన్యాసి!

వాడి కూతురు ముత్తెం [వాడిని "వాడు" అనడం ఏడుకొండలవాడిని "వాడు" అన్నట్టే. కాని వప్పూవణ్ణం వంటబట్టిన బావన తలబిరుసుతనం కాదు.] అందరూ ముత్తె మంటే ముత్తెం అనేవారు - పెట్టుడు పేరు యశోద అయినా.

పిల్లకు ఈడొచ్చి, మిరిటాం పొచ్చింది. వచ్చినా, తన మానాన నవ్వుల్లో పడి ఉండేది. కాని, ఆ నవ్వు నాలుగిందాలు కాలేదు. అనవాయితీగా ఓరచూపులు చూచే ఏ మగరాయుడు కానీ, ముత్తెంవంక పరకాయించి చూసిన పాపాన పోండే! ఆ మనిషిని పరకాయించి చూడటానికి ఎవరికి తరం?

కాని ఎవరికి అలవికాని పని ముత్యానికి అతి సులువు. అదేమి టంటారా? మిట్టమధ్యాహ్నం, రెండు జాముల వేళకు ఫిరంగి వేసే వేళ, ఆరుబయట నిలుచుని సూర్యభగవానుడి వంక ఒక్క అరఘడియ పాటు చూసేది. అది ఎవడి తరం? మొగానికి ఎండ కొట్టేది కాదు. పిల్లది కను గందేది, కాదు. అంతసేపూ నీడలో ఉన్నట్టే ఆ చూపు చల్లగా ఉండేది.

ఆ ఏడు పిల్లకు మనువు చేద్దా మనుకున్నారు కులవు వాళ్లందరూ కలసి. చెన్నుగాడికి ఇంటి జోలి, జోక్యం ఏన్నడూ లేదు. వాడి పెళ్లాం లక్ష్మాయి. సవాలమూ దిద్దుకుపోయేది. దాని తమ్ముడి కొడు కొవా డున్నాడు. వీళ్ల మందలోనే పెరిగేవాడు. పోట్లగొడ్డు లాటివాడు. వాడి కేదో డబ్బు ఎరపెట్టి, ఆ మూడు ముళ్లూ వేయిద్దా మనుకున్నారు. దాంతో ఆ మొక్కు తీరిపోతుం దనుకున్నారు. ఇలా అనుకుంటూన్న సమయంలో ముత్యానికి నెల మసలింది. మొదట్లో రెండు, మూడు మాసాల పాటు ఎవళ్లూ పట్టించుకోలేదు. ఆ తరువాతనైనా పిల్లది వెలపల జేరడం లేదే, ఏదో కుట్టు జేరిందని చేతనైన మందూ, మాకూ వాడి చూశారు. వాటికేం గుణ మివ్వకపోగా, అనాటి కానాడు సుసువు తేలుకుంటూ రావడంతో పిల్లది



గాలితో ఆడుకుంటూన్నా కృష్ణుడు దాని కళ్ళెదుట ఉన్నట్టే. పిల్లవాడికి చిందులు 'ద్రాక్కే ఈడొచ్చినట్టుంది. ముత్తెం కాళ్లకు గజ్జెలు గట్టుకుని, ఉన్నట్టుండి చివాలున ఓ చిందు వేస్తూండేది. పిల్లవాడు చేతి కందకుండా పారిపోతే ఎక్క డెక్కడికో తరుముకుపోయి, ఎక్కడో వెదకి పట్టుకుని బుజ్జగిస్తూ ఇంటికి తీనుకువచ్చేది. ఎలా? కాసేపు వెన్ను నేనుకుని, మరో కాసేపు బుజాన ఎక్కించుకుని! అలా ఒక్క ఏడాది పాటు సాగింది ఆ చిద్విలానం! వాడకట్టున ఉన్న మనుమలకి, అంతమేరా గొల్లగూడెం కాదు. అచ్చంగా రేవల్లెవాడే. అక్కడ పెరుగుతూన్న కానరాని పావడు నయాం తమ వాడే అనిపించింది. చూడ నోచిన నేత్రాలు జోలలు పాడగా, మౌనంగా, ప్రాగన్నుగా జేకొట్టంగా సాలు తిరిగింది. ఇహ కృష్ణాష్టమి రోజులు. ముత్యం ఉన్నట్టుండి తొలి నాటికి మర్నాటికల్లా పడుచుపిల్లలా, పండు ముత్తయిదు వైపోయింది. చిన్నప్పటి ఆ నేవళం తగ్గలేదు సరిగదా, అ దో తీరు నిగారిం పొచ్చిం దా మొగానికి! అయితేనేం, ఈ క్షణాన చూస్తే వెయ్యేళ్లకు ముందు పుట్టిందా అన్న ట్టుండేది. మరో క్షణాన అప్పుడే ఉయ్యాల లూగి నిదుర లేచిన పసిపాప పతు! కాని, ఏ వేళప్పుడు ఏ కళనున్నా మనిషికి ఒకటే కళ - పున్నమినాడు నెల పొడిచినట్టు!

నీళ్లోసుకున్నదని రూఢిగా తేలిపోయింది. ఏమి టీ మాయ అనుకున్నారే కాని, ఎవరూ వంకబెట్టలా! అందరూ ముక్కుమీద వేసుకున్న వేలు దించకముందే అయిదో మాసం వెళ్లింది. వెన్న దిన మనసైంది. ఆరో మాసం వచ్చింది. నెల్లాళ్లపాటు కేవలం మీగడ తప్ప మరొహటి నోట బెట్టలా. ఇహ వేవిళ్లూ, ఆవసోపాలూ, ఓకిలింపులూ... అలా అలా నెలలు నిండినాయ్. కృష్ణాష్టమి దగ్గర పడుతూంది! మూడు పొద్దులూ మూగ నొప్పులు వచ్చి నిలిచిపోయినాయ్. పండగ రేవనగా, ఆనా డంతా పిల్లది మనలో లేదు. ఏడుగురు పట్టుకున్నా ఎగిరిపడేది. ఓ పళానికి కెవ్వున కేకపెట్టి సొమ్మసిల్లిపోయింది. ఒక్క క్షణం అలాగే మాటా పలుకూ, కదలికా మెదలికా లేకుండా పడి ఉన్నదల్లా, పుట్టిన బిడ్డ పొరెడుతూన్నట్టు అలా గుక్కపట్టి, "కన్నా! కన్నా!" అంటూ మళ్లీ నవ్వులో పడ్డది. పిల్లవాడు ప్రాకుతూంటే వాడి వెంట పడి తానూ ప్రాకేది. తారంగం వేసేది! కాళ్ల గజ్జెలు కట్టేది. అలా

ఆ పండగల్లో ఉట్టి కొట్టడం అనేది అనాదిగా వస్తూ ఉన్న వేడుకే! వేడుకంటే, ఎదుటి వాళ్ళకు చూడ వేడుకే గాని, నిజానికి ఆ పంతు ఓ మిడిమేళం.

అప్పట్లో ఏం జరిగిందంటే-

ఆ కులం వాళ్లు, నడికారు వాళ్లు నలుగురూ చేరి ఒళ్లు తెలియని పాళానికి కడుపు నింపుకుని - తూలుతూ, తూగుతూ అడు గేయబోయినప్పుడల్లా లెక్క తప్పి, క్రమం తప్పి, బెడిసిపడి పక్కవాడి మీదికి చిందేస్తూ - ఉండుండి గాలిలోకి ఎగిరి పిల్లి మంతరం వేస్తూ ఉట్టి కట్టిన చోట చేరి పల్లమాలిన గందర చేసేవారు. కొంతసేపటికి ముందటి ఆ యెక్కు దిగిపోవడంలో - మనుమలు నిదానంలో పడి, రోసాలు పుట్టుకొచ్చి ఎవడికి వాడే విద్దెలు చూపించేవాళ్ళు. అప్పుడు మటుకు నిజంగా

మల్లాది రామకృష్ణ శాస్త్రి

కనుల పండువే.

ఉట్టి కొట్టడమంటే పిల్లకాయలు జామచెట్టున కాయ లందుకున్నట్టు కాదు. దానికి ఓ లెక్క ఉంది. ఓ పద్ధతి ఉంది. దాని కో పాటుంది - అందుకు తగిన ఆటుంది.


రేపల్లెవాడలో గోపాలయ్యా!
నువ్వు మా పున్నెమే నయ్యా గోవిందయ్యా!
ఉట్టిమీద ఉన్న చట్టిలోన వెన్న
ఇట్టే మాయంజేసే సిట్టి బుల్లియ్యా!
చల్ల లమ్మబోతే సాటోరి పిల్లకాయ
కొల్లించి పడుపేసే కిష్ణాంతయ్యా...?"

ఇలా, చెమ్మ కొడుతూ [చెమ్మ అంటే చప్పట], అడుగేస్తూ, పాట పాడుతూ, అపై దరువు [చెక్క] అందుకుంటారు. [చెక్క అంటే మనిషీ మనిషీ ఎదురై వేసే తాళం.]

"సిటుకు సిటుకు సిటుకూ
సిక్కని యెన్న సినుకూ-
కొండమీద మొయి లేసి, కొండ కింద
మునకేసి-
సిటాపటా సినుకోసి గోవులన్ని గొల్లుమంటె-
గోటిమీద గొడు గట్టాడె - కిట్టమ్మ
గొల్లోళ్ళకు దేవు డయ్యాడె!"

దీని తరువాత ఝుళుకు [అంటే తాళం మరో లెక్కన]


"మెడలోనే పుళ్ళే, మేనమామనె గొట్టె
తాతకే పట్టంబు గట్టావు రన్నా...




అమ్మోరి పూజకూ అడకూతురు రాగ
అందలం దిందావు అరద మెక్కిందావు
మన్ను దిన్న నోట యెన్న దింటావంట
ఎల్లకాలం నీవు బుల్లోడివే నంట...
ఎంత గట్టోడివిర కిట్టయ్యా...!
నువ్వు ఎంత గడు సోడివిరా కిట్టయ్యా"

ఇలాటివి ఆ సందర్భంలో పాడేవి, పెద్దలు చెప్పిన పాటలూ పదాలూ చాలా ఉన్నాయి. ఎవరికి వచ్చినవి వాళ్లు పాడుతారు.

పాడటం అంటే - పద మెత్తుకునే పాటగాడు ఒక్కడే ఉంటాడు. తతిమ్మా వాళ్లు దరువుకు చిందేస్తూ పంత పాడుతారు.



## చదివిందా?

ఇద్దరు అరణ్యశాస్త్ర పట్టభద్రులు ఒక అడవిలో తిరుగుతుండగా ఒక సింహం గర్జిస్తూ వచ్చింది. వెంటనే మొదటివాడు రెండవవాడితో "జాగ్రత్తగా కదలకుండా సింహం కళ్ళవైపే చూస్తే అదేం చేయదు, తిరిగి వెళ్ళిపోతుంది అని మనం పుస్తకంలో చదివాము కదా!" అన్నాడు.

రెండవవాడు: అవును. నీవూ, నేనూ చదివాము. మరి ఆ సింహమూ చదివే ఉంటుం దంటావా?

కేఆర్కే [హైదరాబాదు]

ఇక ఉట్టి కొట్టడం! దాని పద్ధతి ఎలా అంటే, ఉట్టికొట్టే పిల్లగాళ్లందరూ - దానికి ముమ్మారు చుట్టూ దిరిగి వచ్చిన తరువాత, ఒక్కొక్కడే ఎగ్గా మొగ్గా వేసుకుంటూ, [ఎగ్గ అంటే కూచుని కుప్పించడం] ఉట్టికి అంగ దూరంలోకి వచ్చిన తరువాత - ముమ్మారు చొప్పున మనిషికి మూడొంతుల లెక్కను ఎగరవచ్చు. ఇలా ఎగురుతున్నప్పుడు ఎగిరేవాణ్ణి గజిబిజి చేస్తూ వేడుక చూసేవాళ్ళు నానా గొడవ చేస్తూ, కేరింతలాడుతూ, చిమ్మన గొట్టాలతో వసంతం కొడుతూ ఉంటారు. ఓ చెంపను అందినట్లే ఉన్న ఉట్టి కాస్తా వీ డెగిరేసరికి అదీ పై కెగురుతూంటుంది. ఎలా? దానికి గిలకేసి, గిలక్కు తాడేసి ఓ మనిషి దిగదీస్తూ, ఎగదీస్తూ ఉంటాడు.

చివరకు ఎవడో ఒకడు ఉట్టి కొడతాడు.

అంటే పగులగొడతాడని కాదు. ఎగిరి అందుకని అవళాంగా క్రిందికి దించుతాడు. దుత్తలో ఎంతో కొంత రొక్కం ఉంటుంది. అది పెట్టి ఊరు మాటుమణగే దాకా అందరూ చిత్తుగా పండుగ చేసుకుని బడలిక తీర్చుకుని పడుకుంటారు.

ఇదీ మామూలుగా నడిచే వేడుక.

కాని, ఆ ఏడు అలా జరగలేదు. ముత్యం చెప్పినట్టు జరిగింది - ఎలా?

ఫలానా చోట ఉట్టి కడతా మనుకున్న తరువాత కళ్లాపి జల్లి, పర కేరిపారేసి అంతమేరా అద్దమల్లే జేసి-

కోపు కోలుకి కుంకుమా పసుపూ పెట్టి - [కోపు కోలంటే, రెండు పచ్చి వెదుళ్ళు మాంచి జివ ఉన్నవి లోతుగా పాతి, తలకట్టు గోపురమల్లే చేర్చి కట్టి, మయాన గుంట కట్టి, అడ్డకమ్మీ వేసి దానికి పొన్న మండలు కట్టి, దానికి మయం జేసి ఉట్టి వ్రేలాడ కట్టడం.]

అలా కట్టిన ఉట్టికి ఎనిమిది శేర్లు-

ఉట్టిమీద మూడు దుత్తలు

దుత్తలకు సుద్ద పూసి, సున్నం పూసి, కుంకుమ పెట్టి,

పై దుత్తలో వెన్న తొలి దుత్తలో మీగడ, మలి దుత్తలో పాలు ఉంచి, ఆ వరుసన దుత్తమీద దుత్త పెట్టి ఆ ఉట్టి కెక్కించి

చేతాడుకు మువ్వలు కట్టించగా

ఉట్టి కొట్టే మనుమలు శుచిగా, సుబ్బరంగా కట్టు చెంగులు విరిచికట్టి, నడుముకు కాసెకట్టి, కాళ్లకు మువ్వలు గట్టుకుని ఉట్టికి ఎగరగా,

ఏ మనిషికి చేతికి అందితే ఆ మనిషి అట్లానే తెచ్చి, కుల పెద్ద ముందుంచాలి.

అతడు అలా అందుకున్న వాడి జబ్బకు బాజూబందు కట్టి, సిగలో నెమలి కన్ను పెట్టగా, అందుకున్నవాడు, దుత్తలోనివి ప్రసాదంగా అందరికీ పంచిపెట్టాలి!

అనాటి నుండి మానాటిదాకా అంత ముచ్చటగానే అన్ని కట్టుబాట్లతోనే ఆ వేడుక సాగింది. క్రమంగా అన్ని వర్ణాల వారికి అది పండుగే అయింది. మే మందర మున్నూ ఒకటో అరో ఉట్టి కొట్టిన వాళ్లమే, కోలూ కోపూ వేసిన వాళ్ళమే. గిరేళ్లు పట్టి, దేవుడి ఉత్సవాల్లో ఊరేగిన వాళ్లమే!

ఈ వేడుక ఒక్క మగవాళ్లకే కాదు!

ఆడవారికీ ఇది వేడుకే అయింది. కేవలం చూడ వేడుకే కాదు, హెచ్చరించింది మాలాటి కుర్రకారే. కాని, వాళ్లు మహా వైభవంగా అందుకు పోయినారు!

గొడుకుపేట కంపెనీ తోటలో ఉట్టి కట్టేవారు. ఒకారు పిల్లలకు కృష్ణ వేషాలు వేయించి, వాళ్ళ చేత ఉట్టి కొట్టించేవారు. అప్పట్లో ఊళ్ళో వేడుకలన్నీ ఒక ఎత్తూ, అది ఒక ఎత్తుగా ఉండేది! ఇప్పుడు ఆ ముచ్చటా లేదు, మనుమలకా వేడుకా తెలియదు.

ఈ ఉట్టి కట్టడంలోనూ రెండు పద్ధతులున్నాయి - ఆదిలో దశమినాడు ఉట్ల పండుగ కాని, కొంత కాలానికి అష్టమి నాటికే వచ్చింది.

దేవు డూరేగుతూ వస్తూంటే ముందు నడిచే వాళ్ళు అక్కడక్కడా కొప్పుకోలు నాటుతూ ఊరేగింపు చేర వచ్చేదాకా ఉట్టి కొడుతూ ముందుకు సాగిపోతుండేవాళ్లు. అదే ఎక్కువగా రివాజు. విడిగా కోపుకోలు పండుగ చేసుకోవడం చాలా తక్కువ!

ఉట్టి కొట్టడం సాధారణంగా పొద్దు తిరిగే వేళకే సాగేది. ఓ చెంవను ఇది ఇలా సాగుతూండగా మరో చెంవను గరుడకంబం నాటేవాళ్ళు.

దానికి మా ప్రాంతాల వాడుకలో ఉన్న పైన మిదీ కంబం వదు నాలు గంగుళాలు కైవారం, వదునాలుగు అడుగుల నిడివిన్ని ఉన్న పాలమాను. అనలే అతి నునువు. దానికి తోడు ఇంత వెన్న పులిమేవారు. మాని కొవ్వున గరుడపక్షి చెక్కడం పట్టెనామం! కంబం వేసేవాడు - అంటే ఎగబ్రాకేవాడు ఎలాగో చేవదువుల పట్టు చిక్కించుకుని వల్లటీలమీద పైకి వెళ్ళి వెన్ను విరుచుకుని దణ్ణం పెట్టి; కృష్ణా ద్వారకావాసా; అని అంటూ, అలా ముమ్మా రనేలోపున ఎక్కినట్టుగానే దిగి రావాలి. ఈ వేడుక ప్రొద్దు పోయేదాకా ఇలా ఇలా వెలుతురులో సాగేది.

గరుడ కంబం వాల్చగానే, చర్డీ వరున అది ఏ తెల్లవారుజాముదాకానో అలా సాగుతూ ఉండేది.

ఇహ ఊరిలో త లో మూలా త లో వేడుకా తల కొక వేడుకగా ఉండేది!

నంజె దీవం పెట్టగానే స్వామివారు పొన్న వాహనంమీద ఊరేగితూ వచ్చేవారు! ముందు భోగం మేళం [మా బందరులో స్వామివారి ఊరేగింపు దాకా విందులకూ, ఉపా కర్మలకయినా ఆ కనువిందు హమేషా ఉండి తీరవలసిందే] వాళ్ళకి ముందడుగయిన భజనళ్ళి. బాణా చర్డీ చేసేవాళ్ళు, వల్లట కొట్టేవాళ్ళు, తల్‌వార్ సాము చేసేవాళ్ళు, వాళ్లకి ముందు గిరేళ్ళు, మునుముందు నన్నాయి, ఘనసెట్టు, తాషా నౌబత్ వగైరాలూ అందరికీ ముందు అడుగుగా దేవు డంటి బ్రాహ్మణ పిచ్చివాడూ!

అప్పటి గిరేళ్ళ జట్టు ఎలా ఉండేదని!



ఊరూరా ఉట్లిగొట్లే పండుగ

అందరూ ఒకే సైజు మనుములు [లావూ-నన్నం మినహాయిస్తే] అందరూ ఆ నెమలి కన్ను తురాయి పెట్టుకుని లేత వనువురంగు కుడితినీ లేనుకుని కావి ధోవతులూ, కాళ్ళ గజ్జెలతో ముక్త కంఠాన -

చందమామకన్న నేను చక్కాని దానిరా చక్కాని దానిరా

నందుజూసి నాకు బన్ననరా లంవరా! లలన-

మగడు ఊర లేడు మంచి మాటలాడరా మురళి పాట పాడరా

అగడు కాయక అకులు పోక లంవరా లలన...

అత్తమామ గలదాన్ని అర దొనురా, అన్యాయ మౌనురా

కత్తి వదునువంటి మగడు కలా దాన్నిరా లలన...

చందమామ [చలువతేడు] వేడి వెన్నెల కాయసాగెరా నే తాళ లేనురా

చెంగళ్వరాయ కట్వాడి చెన్నకేశవా లలన

నీరజాయతాక్ష నేను నిల్వలేనురా నిల్వంగలేనురా!"

వగైరా ఇలా పాడుకుంటూ చెంగున దరు వందుకుని

"అదిగో చంద్రుం డుదయం బాయెను వదలలేక నీ వలలో చిక్కితి-"

మదాన మదనా ధిమి మదనా...

ఈ ఊవులో కోలాటం వేస్తుంటే అహెూ, చిన్నికృష్ణమ్మ అక్కడ చిందేయ కిక చూసేనా భక్తి పారవశ్యం అంటే అదీ! బ్రతుకంటే అప్పటి వాళ్లది!

[ముత్యం మాట ఏమిటీ? అపై బ్రతు కెలాటిది అంటారా? ఏముందీ, ఆ ఏడే ఎవరో వెళుతుండగా వాళ్లతో బాటు తీర్థాలు సేవించబోయింది. కాశీ గంగోత్రి దాకా సేవించుకుంది. మళ్లీ తిరుగు ముఖంలో మధుర చేరుకుంది. మ రేమైందో? ఇంకే మవుతుంది! నిరంతరం హరి బోల్ హరి!]

మరొక్క మాట! ముత్యం మా కారు మనిషి కాదు. మా నాడు లేదు! మా ముత్తవ నర్వలక్ష్మమ్మగారనే నర్వజ్ఞురాలు తాను కన్నారా చూసింది విన్నాను. విన్న పైనం విన్నవించుకున్నాను.

